
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1988 ఉగాది మినీకథల పోటీలో రు. 150లు గెలుపొందిన కథ



# ఇది కథ కాదు

## కొల్లూరు కోటేశ్వర రావు

శంకరం కోవెల దగ్గరకు వచ్చేసరికి ఆరు గంటలవుతోంది. వేసవి కాలం కావడాన ఎండ బాగానే వుంది. అక్కడున్న ఓ కొట్లో అరటి పళ్లు తీసుకుని జోళ్లు విప్పబోయేడు. ఇంతలో ఓ కుర్రాడు వచ్చి-

"సార్! జోళ్లిక్కడుంచండి సార్... ఓ అయిదు పైసలు ధర్మం చెయ్యండి చాలు" అన్నాడు.

శంకరం ఆ కుర్రాడి వేపు చూశాడు. వాడికో పదమూడేళ్లుంటాయి. నల్లగా వున్నాడు. చిరిగిన చొక్కా, ఎర్రని నిక్కరు వేసుకున్నాడు. తలకు నూనె రాసి ఎంత కాలమైందో తెలీదుకానీ ఎర్రటి రంగులో వుండి, అగ్గిపుల్ల వేస్తే భగ్గుమని అంటుకునేలా వుంది. శంకరం కానీ వాడికి జోళ్లివ్వకపోతే కాళ్లమీద పడి లాక్కునేంత ఆర్తితగా వున్నాడు.

శంకరానికి ముష్టి అడుక్కునే వాళ్లంటే మహా చిరాకు. కానీ వీడు ముష్టి అడుక్కోకుండా తన శ్రమకి విలువ అడుగుతున్నందుకు ముచ్చటేసింది. సాధారణంగా అతని వ్యాపార దృక్పథంలో ఈ ఖర్చుకి అవకాశం లేదు. ఎందుకంటే ఏ కొట్టు దగ్గరైతే అరటిపళ్లు కొన్నాడో ఆ కొట్టు దగ్గరే తన జోళ్లు దాచుకునే హక్కు అతని కుంది. కానీ ఇంతకు ముందోసారిలాగే జోళ్ళు వుంచితే అవి కాస్తా పోయేయి. కొట్టువాణ్ణడిగితే తన వ్యాపారంలో తమున్నామనీ, జోళ్లు పెట్టడం గమనించలేదనీ, అందు వల్ల తన తప్పు కాదనీ అన్నాడు. శంకరానికి ఆ నష్టం భరించక తప్పలేదు.


అందుకనే యీసారి అలాటి పరిస్థితి ఎదురుకాకుండా ఈ అవకాశాన్ని వాడుకున్నాడు. జోళ్లువిప్పి వాడి దగ్గర పెట్టి- "జాగర్తగా చూడుమీ" అని బొజ్జ సవరించు కుంటూ కోవెల మెట్లు ఎక్కేడు. ప్రతి శనివారం ఈ కోవెలకి రావడం అతని అలవాటు.

మైకులోంచి భక్తి గీతాలు వినిపిస్తున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. శంకరం రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టుకుంటూ తనకి వచ్చిన శ్లోకాలు చదువుకుంటూ క్యూలో నడవడం మొదలెట్టేడు.

శంకరం వయసు ముప్పై అయిదు దాటింది. కిరాణా వ్యాపారంలో లాభాలు బాగానే వస్తున్నాయి. చిన్న చిన్న మోసాలు చేస్తాడుగానీ దేవుడంటే భక్తి, నరక మంటే భయం వున్నవాడు కాబట్టి ఏ వారానికావారం చేసిన పాపాలన్నిటికీ చిరుగుడుగా ఈ గుడికి వస్తాడు. అయితే కోవెలలోకి వచ్చేక అతనెంత ప్రశాంతంగా, ఏ ఆలో చనలు లేకుండా వుండాలనుకుంటాడో, అంతకన్నా చెట్టింపు ఆలోచనలు అతన్ని చుట్టుముడతాయి.

చేటి గురించయితే- అంటే అన్యాయం, పాపం, దురాశ, మోసం లాంటివి- దేవుడి సమక్షంలో ఆలోచించ కూడదనుకుంటాడో అవే ఆలోచనలు వస్తాయతనికి. ఫలితంగా తనని తానే తిట్టుకుని, దేవుడిని క్షమించమని లెంపలేసుకుంటాడు.

ఎలాగయితేనేం కోవెలలో ప్రవేశించి, అంత జనంలో కూడా సాష్టాంగ నమస్కారం చేసి మరీ బయటికి వచ్చేడు. అరటి పండు కాస్తా అక్కడే మండపం మీద కూర్చుని తినేసేడు. ఓ అరగంటసేపు మార్కెట్లో ధరల గురించి ఆలోచించేడు. పాత సరుకు మీద పెరిగిన ధరల కారణంగా రాబోయే లాభాన్ని లెక్క వేసుకుని సంతృప్తిగా లేచాడు.




"తం(డీ! నేను చల్లగా వున్నానంటే కారణం, నీ చల్లని చూపే. ఇదే నాకు జీవితాంతం (పసాదించు" అని భక్తితో నమస్కారం మరోసారి చేసి, హుండీలో రూపాయి బిళ్ల పడేసి బయటికి వచ్చాడు.

అప్పటికి టైము ఏడు కావస్తోంది. బాగానే చీకటి పడింది. తిన్నగా వచ్చి జోళ్ల కొట్టు దగ్గర ఆగేడు. అక్కడ లాంతరు వెలుగులో చూస్తే, కొన్ని జోళ్లు కనిపించేయి కానీ, శంకరం జోళ్లు లేవు. శంకరం గుండె గుభేలు మంది.

"ఏరా! నా జోళ్లేవి?" కంగారు కనపడనీకుండా అడిగేడు.

"దాన్లో లేవాసార్!" వాడి గొంతులోనూ, మొహం లోనూ ఆశ్చర్యం.

కు(రాడి పక్కనే ఓ ముసలాడు- గుడ్డివాడిలా వున్నాడు- వాడు కలగజేసుకున్నాడు.

'ఏమైందంటూ'. సంగతి చెప్పేడు శంకరం విసుగూ, చత్రుతగా.

"సరిగ్గ సూసేరా బాబూ!" ముసలాడి గొంతు లోనూ భయం తొంగి చూసింది.

"నాక్కూడా కళ్లు లేవనుకున్నావేం(టా" విసుగ్గా అన్నాడు శంకరం, కళ్లతోనే చుట్టూ వెతుకుతూ.

"ఏరా యెక్కడెట్టినావ్‌రా యెదవనాయాలా" గుడ్డోడు కు(రాణ్ణడిగేడు, క(ర వెతుక్కుంటూ.

"ఇక్కడే యెట్టినా(నా అయ్యా. ఇంతలో ఏటైపోతా దని..."

"కుక్కెట్టుకు పోనేదు కదా?" అనుమానంగా అడిగేడు గుడ్డోడు.

"ఒరే కుక్క వెధవల్లారా! నాటకాలొద్దు. మర్యాదగా జోళ్లు బయటికి తియ్యండి. లేకపోతే వర్మం వొలిచేస్తాను" అన్నాడు శంకరం కోపంగా.

అప్పటికే కొంతమంది చుట్టూ మూగేరు. వాడికి జోళ్లు అప్పచెప్పాలనుకున్న వాళ్లు కాస్త ఇంకో కొట్టుకి వెళ్లిపోయేరు.

ముసలాడు క(ర అందుకున్నాడు. కొడుకు చేతిని తడిమి పట్టుకుని "ఏరా నంజికొడకా, జోళ్లెక్కడెట్టేందీ సరిగ్గా సూసుకోవూ?" అని గట్టిగా క(రతో రెండు దెబ్బలు కొట్టాడు,

"నాకేటి తెలీదరయ్యా! ఆ దేవుడి సాచ్చిగా సెప్త న్నాను. నేన్సూత్తుండగా ఎవురూ యెట్టుకుపోనేదు" అన్నాడు ఏడుస్తూ, దెబ్బలు తడుముకుంటూ.

శంకరంకి వాడి మాటలు నమ్మాలని పించడంలేదు. ఆ జోళ్లుకొని కేవలం పది అంటే పది రోజులైంది. ఇంకా కొత్తగా వున్నాయి. అవి చూడగానే వీడి కన్నుకుట్టి వుంటుంది. అందుకే దాచేసి వుంటాడని అతని అనుమానం. ఆ అనుమానం రాగానే ఆలోచించకుండా "నువ్వు మర్యాదగా చెప్పవొరేయ్" అని శంకరం కూడా వాణ్ణి కొట్టేడు. ఆ దెబ్బకి వాడు అమ్మో అనరిచి ఏడిచాడు. ఆ అరుపుకి వాడి అమ్మ రాలేదుకాని మరి కొంతమంది చుట్టూ మూగేరు, చోద్యం చూడ్డానికి. కొంతమంది సంగతేమిటో తెల్సుకుని తలా ఓ మాటా అన్నారు వాణ్ణి.

ఆ మాటలకేనా అన్నట్టు వాడు మరీ ఏడుస్తున్నాడు.

"చెప్పరా. ఎక్కడు దాచేవ్?" శంకరం మళ్లీ కోపంగా చెయ్యెత్తాడు.

"పోలీసుల్ని పిలిపించండి సార్!" ఉచిత సలహా పారేశాడెవరో.

"జోడు తీసికొట్టాలిలాటి వెధవల్ని" అని నిప్పు రాజేసేడింకొకడు.

అన్నిటికీ సమాధానంగా వాడు ఏడుస్తున్నాడు తప్ప యింకేం చెప్పలేకపోతున్నాడు. శంకరంకి కోపం ఆగింది కాదు. ఫలితంగా మరి రెండు దెబ్బలు కొట్టడం, ఆ దెబ్బలకి వాడు కింద పడడం, 'సచ్చే(నా అయ్యా' అంటూ అరవడం, గుడ్డోడు కూడా ఏడుస్తూ "ఆణ్ణి సంపీకండయ్యా" అంటూ అడ్డుకోవడం, శంకరం ఆ గుడ్డోడ్నికూడా "తోడుదొంగ లంజకొడకల్లారా!" అని తిట్టి మరీ తన్ని, కు(రాణ్ణి మళ్ళీ లేపి కొట్టడం అక్కడున్న చాలా మందికి ఉత్తేజం కలిగించిందనే చెప్పాలి. ఎందుకంటే ఎవరూ శంకరాన్ని వద్దని వారించ లేదు.

గుడ్డోడు, కు(రాడు కిందకూర్చుని ఏడుస్తున్నారు- తమ జన్మల్ని తిట్టుకుంటూ. కు(రాడు మోచేతుల్నుండి జారుతున్న రక్తాన్ని ఉమ్ముతో అద్దుకుంటున్నాడు. గుడ్డోడు ఏడుస్తూ మధ్యమధ్య రెండు చేతులెత్తి దణ్ణం పెడుతూ ఏదో అంటున్నాడు కానీ ఏవీ స్పష్టంగా వినబడడం లేదు.

శంకరం మరి కొట్టలేదు. నాలుగు దెబ్బలేసేక అతనిలో కోపం తగ్గి ఆలోచనలు (పారంభమయేయి. 'ఒకవేళ వాడు దాచలేదేమో!' అని అనిపించినా ఎటూ తేల్చుకోలేక తనని తాను తిట్టుకుంటూ బయల్దేర బోయేడు. మిగిలిన వాళ్లూ వెళ్లిపోయేరు.

ఇంతలో ఓ విచి(తం జరిగింది. ఎవరో ఒకతను వచ్చేడు.

"ఇక్కడ జోళ్లు చూసే కు(రాడేడీ?" అని ఎవరినో అడుగుతున్నాడు. అతను "ఏం? మీ జోళ్లు కూడా పోయాయా?" అని జోక్ వెయ్యడం శంకరానికి విని పించింది.

"అబ్బే. అదేం కాదు. ఇందాక చీకట్లో నావేననుకుని ఇంకెవరి జోళ్లో వేసుకుని వెళ్ళిపోయాను. అయినా నాకెందుకో అనుమానంగానే వుంది..." ఆ తర్వాత మాటలు శంకరం వినకుండానే ఆ వచ్చినతని వేపు నడిచేడు. అతని కాళ్లకున్న జోళ్లు పరిశీలనగా చూసేక, అతని ఆనందానికి అంతులేదు. అవి శంకరం జోళ్లే.

"గొప్పపని చేసారు సార్! అవి నావి... వాటి గురించే యీ గొడవంతానూ..." అన్నాడు.

"మీవా?... సారీసార్!" నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడతను.

"ఫర్వాలేదులెండి..." అని జోళ్ళు వేసుకోబోయేడు శంకరం.

అప్పుడు జోళ్లు చూసే కు(రాడు లేచి నిలబడి శంకరం వేపు వచ్చేడు. శంకరం మనసులో భయం లాటిది కలిగింది. 'కొంపదీసి నన్ను తన్నడుకదా?' అనుకున్నాడు లోలోన. "సార్! ఇంతసేపూ నన్నో దొంగోడి కింద కట్టేరు. నేను ముందునించీ సెప్తానే వున్నాను నేను దొంగని కాదని... మీరు సదూకున్నోళ్లు. ఎవరో సేసిన పొరపాటుకి ఇక్కడ నేను తన్నులు కాసేను. ఇంతమంది నేను తన్నులు తినడం సూసేరు. ఒవురేనా మిమ్మల్ని ఆపేరా?... లేదు. నన్ను కొడుతున్నప్పుడు మీరందరూ దొంగలాగే సూసేరు. కానీ నేన్తప్పు సెయ్య లేదని తెల్సేక ఎవురూనేరు. రేపట్నుండీ 'నేనిక్కడ జోళ్లు సూత్తాన్సార్!' అంటే ఎవురేనా వస్తారా సార్! మీరే చెప్పండి...'

ఇదేం అడగలేదు వాడు. వాడి మనసులో ఆనందం తను దొంగకాదని తేలినందుకు. ఆ లేత మనసులో సంతోషం అకారణంగా.

"సార్ నా అయిదు పైసలు..." వినయంగా అడిగేడు వాడు.

శంకరం మనసు చలించిపోయింది. జేబులోంచి అయిదు రూపాయిల నోటుతీసి వాడి చేతిలో పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయేడు. **